# ఏమి సంబంధము!

("ఆంధ్రపత్రిక" - 1949 - ఉగాది)

## (1)

అప్పటికి నాకు పదహారేండ్లో, పదిహేడేండ్లో, సరిగా జ్ఞాపకం లేదు. ఏదో బంధువుల యింట్లో పెళ్ళికి వెళ్ళాం, ఒక ఊరు. మేము మగపెళ్ళివారము. ఒక యిల్లు విడిదికి యిచ్చారు. ఆ యింటివాళ్ళు వాళ్ళ యింట్లో కొంత మేర సర్దుకొని తక్కిన భాగం విడిదికి వదలిపెట్టారు. కాని అది పల్లెటూరు. అయిదురోజుల పెండ్లి. పెళ్ళి వారింటికి ఆయింటివారుకూడ రెండు పూటలు భోజనానికి, రెండు రోజులు గడిచేటప్పటికి వాళ్ళూ వీళ్ళూ కలిసి చనువుగా ఉంటున్నారు. మూడవరోజున మధ్యాహ్నం అనుకొంటాను. నేనా చావట్లో పడుకొన్నాను. ఆ యింటాయన ఎప్పుడో చనిపోయినాడు. ఆయన భార్య, కూతురు, ఆ యింట్లో ఉంటున్నారు. మగపిల్లలున్నారు. వాళ్ళు చదువుకోటానికి వెళ్ళారోయేమో? ఊళ్ళో లేరు. ఈ రెండు రోజుల మట్టీ నేనెవ్వరో వాళ్ళకు తెలుసు. నేను చదువుకొంటున్నానని, మాది అన్నోదకాలకు లోపంలేని సంసారమని ఆవిడకి తెలిసింది. నేను కొంచెం తెలుగులతో పరిచయం చేయడం, కంఠమెత్తి పద్యం శ్రావ్యంగా చదవటం అప్పటికే ఉంది. సామాన్యంగా మన యిళ్ళలో ఆడవాళ్ళు భర్తలు పోయిన తర్వాత భారతమో, భాగవతమో, భక్తవిజయమో ఇలాంటి గ్రంథాలు చదువుకుంటూ కాలక్షేపం చెయ్యటం సహజమే. ఆవిడ కూడా అటువంటిదే. అందుచేత నేను తెలుగు పుస్తకాలతో పరిచయం కలవాణ్ణి అని తెలియటం మూలంగా నేనంటే ఈ రెండురోజుల్లో కొంచెమభిమానంగా ఉంది.

ఆవిడ కూతురు అప్పటికి పదేండ్లపిల్ల. కాలుపొడగరి. చిదిమి దీపం పెట్టవచ్చు.తల్లి చాలా భారీ మనిషి. అమ్మాయి కూడా పెద్దదైతే తల్లియంతది ఔతుందిలాగా ఉంది. పుష్టిగల పిల్ల. చేతులు పొట్లాలల్లే ఉన్నవి. ఆ మొగములోని అందము చెప్పటానికి వీలులేదు. పెద్ద కళ్ళు, గుబురుగా పెరిగిన నల్లని కనుబొమ్మలు. భగవంతుడు సౌందర్యం అంటే ఇట్లా ఉండాలి అని చేసి

చూపినట్లుగా ఉంది ఆమె మొగం. ఆ పిల్ల నవ్వుతుంటే ఇప్పుడు తలచుకుంటే అప్పుడు నేనెంత ఉవ్విళ్ళూరానో తెలుస్తుంది. కాని ఆ పిల్లను చూచి నేనెంత సంతోషించానో మనస్సులో అంత దిగులూ పడ్డాను. మా నాయనగారు నాకు పదియవ యేటనే పెండ్లి చేశారు.

ఆ మధ్యాహ్నం సావిట్లో పండుకొని ఉండగా ఆ తల్లి, కూతురు ఇద్దరూ వచ్చారు. ఆ తల్లి నన్నేమైనా పద్యాలు చదవమన్నది. నేను చదివాను. ఆవిడ చాలా సంతోషించింది.

ఆ కూతురు ఎంత అందకత్తెయో అంత చిలిపి పిల్ల. ఆ పిల్ల నాతో సరాగాలాడటం మొదలుపెట్టింది. అప్పటికి చిన్నతనం; వివృతం కాని జీవితంలో ఉన్న మోహమంతా సుందరంగా భాసించే రోజులు. ఆ పిల్ల దగ్గరకు వస్తే నాతో మాట్లాడితే, నవ్వితే, పరాచికాలాడితే, అప్పుడు నా శరీరమంతా పులకితమైంది. నా మనస్సంతా ఆనందధామమైంది. ఆ పిల్ల శరీరచ్ఛాయ మేలిమిబంగారం. ఆ కాంతి వ్యాపించి నా శరీరంలో చొచ్చి నేనేదో ఒక తేజోమూర్తినైనా ననిపించింది.

ఆరోజున సదస్యమవటం మూలంగా పెళ్ళి వారందరూ పెళ్ళి యింట్లోనే ఉన్నారు. మేము ముగ్గురమే విడిదిలో ఉన్నాము. ఆ పిల్ల చేసిన కొంటె పనులన్నీ జ్ఞాపకం లేవు. లీలగా ఈ ఒక్కవిషయమే జ్ఞాపకముంది.....

నేను చిన్నప్పటినుండి బస్తీలో చదవటం మూలంగా పల్లెటూరి విషయాలు నాకు తెలియనివి కొన్ని మిగిలిపోయినై. అన్ని చెట్లు ఎఱుగుదును. అన్ని మొక్కలు ఎఱుగుదును. సీమ మెరపకాయ మాత్ర మెఱుగను. సరిగా అది గండు చీమంత ఉంటుంది. ఆ ప్రమాణంలోనే పండుతుంది. ఆ పిల్ల వాళ్ళ దొడ్లోకి పోయి పండిన యొక సీమ మిరపకాయ తెచ్చి నాకిచ్చి యిది తియ్యగా ఉంటుంది. తినమన్నది. అందులో తెలివిగా ఏమి చేసిందంటే? తొడిమ లేకుండా తెచ్చింది. కామంచి పళ్ళు మొదలైనవి యెఱుగుదును; ఇదీ అట్లాంటిదేమో ననుకొన్నాను. అని నోట్లో వేసికొని నమలితిని. ఇంక చూడు, నోరు మండిపోయింది. ఆ మంటని తట్టుకోవటం కష్టమైంది. అటు పరుగెత్తి ఇటు పరుగెత్తి నీళ్ళు పుక్కిలించి ఉమిసి ఎంతచేసినా కారము తగ్గదు. కళ్ళవెంట నీళ్ళు, ఆపసోపాలు

పడటం, చెవుల్లోంచి పొగరావటం, నేనింత బాధపడుతుంటే ఆ పిల్ల నవ్వటం, తల్లి చిఱునవ్వుతో తూష్ణీభావం వహించటం, ఇద్దరిలోనూ నాయందు ద్వేషంలేదు. ఇద్దరికీ నేనంటే అభిమానం ఉన్నది. నేను తెలివి తక్కువగా ఆ కాయ నమలటమేమిటి? నా మనస్సులో కొంత సిగ్గూ ఉన్నది. ఆ పిల్ల మీద నాకు గల ప్రేమని, నా చిన్నతనపు తెలివితక్కువ వలన వచ్చిన సిగ్గు, వెక్కిరించింది. ఆ పిల్ల నేను బాధపడుతుంటే సంతోషించటానికి కోపం వచ్చింది. కాని ఆ సిగ్గునూ కోపాన్నీ అణచిపెట్టి నేను కూడా అదంతా ఒక సరదాలాగా నటించక తప్పక వచ్చింది....

నాకు వివాహమైందని ప్రసంగంలో మా అమ్మగారి వల్ల ఆవిడకి తెలిసింది. ఆవిడ నవ్వుతూ "అయ్యో! అల్లాగా మా అమ్మాయిని మీరు చేసుకుంటారనుకున్నానే?" అంది. పెళ్ళి అయిదవ రోజున మా దారిని మేము వచ్చేశాం. తరువాత యేడాదికో రెండేండ్లకో నా భార్య కాపురానికి వచ్చింది. ఆ పిల్లను గుఱించి ఐదారేండ్లు తలచుకొంటూ ఉండేవాడిని. వాళ్ళకూ మాకూ బాంధవ్యమూ లేదు. ఆ యూరికీ మాకూ సంబంధమూ లేదు. పూర్తిగా మఱచియే పోయినాను.

**(2)**

మంచి నడివేసంగి. ప్రొద్దుటిమట్టి భోజనం లేదు. బెజవాడలో ప్రొద్దున్నే ఆరుగంటల కెక్కితే సాయంత్రం అయిదున్నరకి గుంటకల్లులో దిగింది బండి. నేను అనంతపురం వెళ్ళుతున్నాను. ఆరోజున శుద్ధసప్తమి అనుకొంటాను. సంజవెన్నెల కాస్తున్నది. అనంతపురం బండి బయల్దేరింది. నాలుక పిడచ గట్టుతోంది. ఈ చెవిలో గాలి ఆ చెవిలో దూసుకొంటోంది. ఆ గాలి మొగం మీద, చేతులకు తగిలినంతమేర విరవిరలాడి పోతున్నది. ఆ రైలుబండి యెందుకు వచ్చిందిరా బాబూ అన్నట్టు నడుస్తున్నది. దూరాన చిన్ని చిన్ని గుట్టలు, చీకటి ముద్దలు పడ్డట్లు కూర్చున్నవి. ఎటుచూసినా రాళ్ళే. వాగుల మీదుగా పోతున్నది. వాగులలోని యిసుక, వెన్నెలలో నీళ్ళు లేక నాలుక చాచినట్లున్నది. రైలుపెట్టెలలో నీళ్ళు లేవు. స్టేషను వస్తుంది గదా. అక్కడ మంచినీళ్ళు దొరకుతవని ఎదురుచూచాను. ఒక స్టేషను, రెండు స్టేషనులు ఏ స్టేషనులోనూ నీళ్ళు లేవు.

త్రాగే నీళ్ళని డబ్బాలు పెట్టారు. వాటిలో నీళ్ళు లేవు. నా ప్రాణం తహతహలాడి పోతోంది. అప్పటికే తొమ్మిది కావస్తోంది. ప్రతి స్టేషనులో దిగటం, ఆ పలుచకు పోయిన వెన్నెల్లో రాత్రి ప్లాటుఫారముల మీద నీటికోసం దేవులాడటం.

ఒక స్టేషనులో నేను రైలు పెట్టెలో నుండి దిగి నీళ్ళు దొరుకునేమో యని వెళ్ళుతుంటే ఆడవాళ్ళ పెట్టెలో ఒక స్త్రీ నన్ను పిలిచి "అయ్యా! మా పిల్లల నాలుకలు ఎండిపోతున్నవి. కొంచెం మంచినీళ్ళు తెచ్చిపెట్తారా?" అంది. నేను కూర్చున్న పెట్టెలో దీపం గ్రుడ్డిది. ఆ ఆడవాళ్ల పెట్టెలో దీపం మంచిప్రకాశంగా ఉంది. అయినా ఆవిడ కిటికీలో నుండి వ్రాలి నాతో మాటాడటం మూలంగా వెల్తురామె మొగం మీద పడటం లేదు. ఆవిడ ముఖరేఖలు నాకు విస్పష్టంగా కన్పించటం లేదు. స్థూలంగా చూస్తే చాలా అందకత్తెవలె కన్పించింది.

"సరే, నేను మంచినీళ్ళకోసమే వెళ్ళుతున్నాను. దొరికితే తెస్తా" నన్నాను. "ఇదిగో ఈ చెంబు తీసుకువెళ్ళండి" అని ఆమె మరచెంబు మర తీసి నాచేతి కందిచ్చినది. ఆ దప్పిక స్థితిలో స్త్రీ పురుషవిభేదం లేదు. పరపురుషనిభేదం లేదు. ఆవిడ చేయి నాకు తగిలినది. ఇంకో గంట సేపటివఱకు నీళ్ళే దొరకకపోతే వడకు చచ్చిపోవటమే. మృత్యువునకు గంట దూరములో ఉన్న ఆసమయంలో ఆవిడ చేయి నాకు తగిలి నేను సంతోషించటం అధర్మలక్షణమా? జంతు లక్షణమా?

ఆ స్టేషనులో నీళ్ళు దొరికినవి. నేను కడుపునిండా త్రాగాను. ఆ చెంబునిండా పట్టుకొన్నాను. నేను బ్రతికానన్న సంతోషం కంటె ఆవిడకి చెంబెడు నీళ్ళూ తీసుకువచ్చి యివ్వటానికి వీలైందన్న సంతోషమెక్కువైంది. నేనావిడకి మహోపకారం చేస్తున్నాననా? ఈ ఉపకారానికి ప్రత్యుపకారంగా ఆమె నాయందు స్నిగ్ధురాలౌతుందనా? నీళ్ళు తీసికొని వెళ్ళి యిచ్చాను. ఆవిడ చెంబు పుచ్చుకొనటంలో ఈసారి తన చేయి నా చేతికి తాకకుండా పుచ్చుకొన్నది. పిల్లల కిచ్చింది. తాను కొంచెం త్రాగింది. నేనా పాటున వెళ్ళిపోవచ్చునా, వెళ్ళిపోలేదు. "చాలునా? ఇంకొక చెంబెడు తీసుకుని రానా?" అని అడుగుతూ అక్కడే నిలుచున్నాను. ఆమె "అక్కరలేదండీ" అంది. నేను నీళ్ళు తెచ్చిపెట్టానన్న కృతజ్ఞత ఆమె మొగంలో ఉన్నది. కాని "నేను కృతజ్ఞురాలను. నమస్కారములు." మొదలైన నాగరపు మాటలు ఇంగ్లీషుభాష నేర్వనివాళ్ళకు తెలియవు గనుక, ఆమె నాతో ననలేదు. కాని, మొగములో నా కృతజ్ఞత మాటలన్నీ రెట్టింపు కనిపించుచున్నవి.

ఈ పిల్లలకు మంచినీళ్ళిచ్చుటలో ఆమె అటు నిటు మసలుటలో ఆ చక్కని వెలుగులో నామె మొగము చక్కగా కనిపించినది. మొదలు ఆమె సౌందర్యమే నన్నుకొట్టింది. తరువాత ఆమె మొగమెక్కడో చూచినట్లనిపించింది. నన్నదివఱకామె చూచినట్లామె మొగములో లేదు. నేనిదివర కామెను చూస్తే ఆవిడా నన్ను చూచియుండాలి కదా? ఇది కాకుండా కొందరిని చూచినప్పుడు వాళ్లని మనం చూడకపోయినా చూచినట్లుంటుంది. అటువంటి ముఖలక్షణములు కల వ్యక్తి నెవరినో చూచియుంటాము. ఆ లక్షణ సామ్యం చేత వాళ్ళనే చూచినట్లుంటుంది. మీదే ఊరు? మీరెక్కడికి వెళ్ళుతున్నారు? మొదలైన ప్రశ్నలు వేస్తే బాగుండేదేమో? కాని ఆమె మొగము చూస్తే కృష్ణాగోదావరి జిల్లాల స్త్రీల వలె ఉన్నది గాని దత్తమండలపు స్త్రీ వలె లేదు. అడుగుదామనుకొని అడగకుండానే నాపెట్టెలోకి నేను వెళ్ళిపోయాను. కాని ఆమె సుందరమైన ముఖం నా మనస్సులో ముద్రితమయ్యే ఉన్నది.

**(3)**

తర్వాత రెండేండ్లకు ఆ ఊళ్ళో నాకుద్యోగమైంది. అక్కడికి వెళ్ళాను. అద్దె యింటికోసం తిరిగాను. చివర కొక యింట్లో ఒక భాగం కుదిరింది. కుదిరినరోజున సాయంత్రం మావాళ్ళు వచ్చారు. ఆ ప్రక్కభాగం ఎప్పుడూ తాళం వేసే వున్నది నాలుగు రోజులు. ఆ యింటాయన వేరే కాపురముంటున్నాడు. ఆభాగంలో ఎవరుంటున్నారని అడిగాను. ఆ ఉంటున్నాయన కలెక్టరాఫీసులో గుమస్తా అనీ, ఆయన భార్య ప్రసవించటానికి పుట్టింటికి వెళ్ళిందని, ఆయన ఒక్కడే ఉంటున్నాడనీ, నాలుగురోజులు సెలవు మీద యింటికి వెళ్ళాడనీ చెప్పారు. అయిదవరోజున ఆయన వచ్చాడు. ఆయన సబ్‌మెజిస్ట్రేటు చేసి మళ్ళీ కలెక్టరు ఆఫీసుకు ఒక పెద్ద గుమస్తాగా వచ్చాడు. ఆయన రాత్రి యెప్పుడో పదింటికి వచ్చేవాడు. ప్రొద్దున్నే తొమ్మిదింటికి వెళ్ళేవాడు. నేను రోజూ ప్రొద్దున్నే లేచేటప్పటికే ఏడున్నరౌతుంది. మేమిద్దరము కలుసుకొని మాట్లాడడమే పడలేదు. పైగా ఆయన కొంచెం మెజిస్ట్రేటు చేసి వచ్చినవాడు గనుక కొంచెం టెక్కు గూడా కలవాడు. నాలుగైదు నెలలు ఆ యింట్లో కలసి ఉన్నా ఆయనా, నేనూ కలసి మాట్లాడలేదు. ఆయనెవ్వరో? నేనెవ్వరో? ఇట్లా ఇంకొక నెల గడిచింది.

ఒకరోజున సాయంత్రం పూట వాకిట్లో వచ్చి గుఱ్ఱపుబండి నిలిచింది. అందులో నుండి ముగ్గురుపిల్లలు, పసిపిల్ల తల్లీ దిగారు. నేను వాకిట్లో కూర్చుని యేదో వ్రాసుకుంటున్నాను. తలయెత్తి చూస్తే ఆవిడ కనిపించింది. చప్పున పోల్చుకోలేక పోయాను. రెండేండ్ల క్రిందట రాత్రిపూట రైలుపెట్టెలో ఉన్న వెలుగులో చూచిన మొగమాయెను. కాని ఆ కనులు కనుబొమ్మలు 'నేనే' అన్నవి. ఆవిడ బండి దిగుతూనే తల యెత్తకుండానే యింట్లోకి వెళ్ళిపోయింది. ప్రక్కభాగంలో ఎవరో ఉన్నారు. మనకెందుకులే అనుకున్నదో! ఎవరో ప్రక్కభాగంలోకి వచ్చారని భర్త చెప్పాడో! ఎంత అనుకొన్నా ప్రక్కగా ఒక మనిషి ఉంటే తలయెత్తి చూడటం మానవసహజం. తాను మెజిస్ట్రేటు భార్య. రేపు ప్రొద్దున మగడు తహసీల్దారౌతాడు. మనసులో ఆ అహంకారం ఉండియుండవచ్చు.

కాని ఆవిడ బండి దిగి యింటికి వెళ్ళే వరకూ నేనావిడ వంకనే చూస్తున్నాను. భర్త గూడ వెంటనే ఉన్నాడు. నేను తన భార్య వంక చూస్తున్నానని ఆయనకు తెలుసు. నన్ను మర్యాద తెలియని వాడనుకోవలసిందే కాని, గద్దించటానికి వీలు లేదు. అభియోగం తీసుకురావటానికి వీలులేదు. ఆయన నడకలో, చూపులో ఒక తిరస్కృతి. నిరాదరణ కనిపించినా పైకిపొక్కలేదు. అయినా నేనిట్లు వ్రాయడమెందులకు? చూస్తే తప్పా! ఇది మనుష్యసహజం. ఊరికే చూచారో, దురూహతో చూచారో, ఎట్లా తెలుస్తుంది?

ఇంతకు ఆవిడ ఆనాడు ఎండదెబ్బ తగిలినా మనిషి యొక్క శరీరము, మొగము పుష్టిగా కనిపించినది. ఇప్పుడు బక్కచిక్కి యున్నది. ఆనాటి శరీరసౌష్టవం లేదు. బుగ్గలు లోపలికి పోయినవి. కనులు కొంచెము గుంటలు పడ్డవి. కానుపు చాలా కష్టపు కానుపైందేమో? పాపమింకా తేరుకోలేదనుకొన్నాను.

పదిరోజులైంది. మాఅమ్మ అంది. "అబ్బో! వాళ్ళకు చాలా టెక్కు. పలుకరించినా మాట్లాడరురా" అని. "పోనీలే" అన్నాను.

ఆ ఊళ్ళో నూతులు పాతాళగంగలు. ఒకరోజు వాళ్ళ పనిమనిషి రాలేదు. స్నానానికీ, పానానికీ అన్నిటికీ ఆవిడే తోడుకోవాలి. మనిషి పాపం నీరసస్థితిలో ఉంది. తొమ్మిదిన్నరకు అన్నం పెట్టకపోతే ఆ మగడు ఆవిడమీద గూడ మెజిస్ట్రేటుగిరీ చలాయిస్తాడు. రాత్రికి పెందరాడే వంట కావాలి. భోజనం చేసి ఆఫీసుకి వెళ్ళాలని చెప్పాడట సాయంత్రం. నేనైదింటికి యింటికి వస్తే

నూతిలో నీళ్ళు తోడుతోంది. ఒకబొక్కెన బయటకు వచ్చేటప్పటికి ఆవిడ ప్రాణాలు కడబట్టుతున్నవి. అక్కడ రెండుబిందెలు పెట్టింది. రెండు బిందెలనిండా నీళ్ళు కావాలి. నాలుగు బొక్కెనలైతే గాని బిందె నిండదు. నేను "కొంచెం కాళ్ళు కడుక్కుంటాను. బొక్కెన యిస్తారా? అన్నాను. ఆవిడ బొక్కెన వదలిపెట్టి యింట్లోకి వెళ్ళింది. నేను కాళ్ళు కడుక్కొని ఆ రెండు బిందెల నిండా నీళ్ళు తోడి యింట్లోకి వెళ్ళాను.

ఆ నీళ్ళు తోడిపెట్టటం వల్ల ప్రసన్నురాలైందో, ఆ రైలుబండిలో నీళ్ళు తెచ్చిన నాటి గుర్తు తగిలిందో, మా అమ్మతో, మావాళ్ళతో పరిచయంగా మాట్లాడటం ప్రారంభించిందట.

చిన్నప్పుడు రాగచ్ఛాయగా పద్యం చదవటమనే గుణం నాలో పెరుగుతూ వచ్చింది. అప్పుడు కంఠమెత్తి పదిపదిహేను రాగాలు పద్యాలమీద జోడించి పాడటం, పర్వాలేదు, బాగానే వుందని వినేవాళ్లనుకోటం జరుగుతుండేది. వారానికో, పదిరోజులకో ఒకసారి రాత్రిపూట భోజనం చేసి పడుకొని సంగీతాలు తీస్తుండటం నాకలవాటు. ఒకరోజున రాత్రి అల్లా సంగీతాలు తీశాను. మరునాడు, "మీ అబ్బాయి సంగీతం పాడుతా రాండీ?" అని మా అమ్మతో అన్నదట.

తరువాత వారం రోజులకు పగలు నేను భోజనం చేస్తుంటే మా అమ్మ చెప్పింది. "ఒరేయి ఈ అమ్మాయి యెవరో యెఱుగుదువా? నీ చిన్నప్పుడు మన మా ఊరి పెళ్ళికి వెళ్ళితే, నీ చేత సీమ మిరపకాయ కొరికించిందే, ఆ అమ్మాయి. మొన్న నేను ఆ అమ్మాయిని కూర్చోబెట్టి పుట్టుపూర్వోత్తరాలన్నీ అడిగాను. ఈ అమ్మాయి తమ్ముడు ఇప్పుడు మన ఊళ్ళో ఉద్యోగం చేస్తున్నాడట. మనయింటి ప్రక్కన, రెండిండ్ల అవతల ఉన్నదే రామారావుగారి యిల్లు! ఆ యింట్లో అద్దెకున్నారట. వాళ్ల అమ్మ నాకు మల్లేనే చాలా ముసలిదైనదట. నిన్నెక్కడ చూచామా అని ఆ అమ్మాయి అనుకొన్నది. నీవు సంగీతం పాడిన తర్వాత ఆ అమ్మాయికి సరిగా తెలిసిందట. నీవు పాడిన పద్యమే సరిగ్గా అట్లాగే పాడావట. అప్పుడు చప్పున ఆ అమ్మాయికి జ్ఞాపకం వచ్చిందట" అని చెప్పింది.

అదివఱకే అనుకుంటున్నాను. వాళ్ళాయనకు తహసీల్దారైంది. మా అమ్మ యీ మాట చెప్పిన మఱునాడే వాళ్ళు యిల్లు ఖాళీచేసి వెళ్ళిపోయినారు. ఆ రోజున నేను ఊళ్ళో లేను.

**(4)**

తర్వాత మూడేండ్లకు నేనావూళ్ళో ఉద్యోగం మానేసి మా ఊళ్ళో చేరాను. ఆవిడ తమ్ముడు అతని సంసారం, ఆ రామారావుగారింట్లోనే అద్దెకుంటున్నారు. వాళ్ళ కబుర్లు రోజూ చెప్పుకుంటూనే ఉంటాం. తెలిసిందేమిటంటే ఆ అమ్మాయి మళ్ళీ కడుపుతో ఉందని, తమ్ముడు అక్కగారిని పురిటికి తీసుకొని వస్తాడనీ, అయిదవ నెల పడలేదు, ఏడవనెల పడలేదు, తొమ్మిదివ నెల వచ్చింది. తల్లిపోరు పడలేక తీసుకొచ్చాడనీ, ఆ అమ్మాయి ప్రసవించే రోజులనీ, మూడవరోజు రాత్రి ఆ అమ్మాయికి నొప్పులువచ్చినవనీ, డాక్టరును తీసుకువచ్చారనీ, ఆ రోజు రాత్రి యెల్లాగో అల్లాగ గడిచిందనీ.

తర్వాత రెండురోజులు ఆవిడ పని కిందెట్టుమీదెట్టుగా ఉన్నది. ప్రసవ సంబంధమైన వ్యాధి కాదు. వేరే వ్యాధి యేదో వచ్చింది. చట్టుపట్ల యిళ్ళ వారందరూ చూడటానికి వెళ్ళారు. నేనూ వెళ్ళాను. వెళ్ళిన నిమిషంలోనే ఆ అమ్మాయికి ప్రాణ నిష్క్రమణ వేళ అయింది. క్రిందకు దింపటానికి యెవ్వరూ లేరు. భర్తకు టెలిగ్రామిచ్చారు. రాలేదు. నేనూ వాళ్ళ తమ్ముడూ పట్టుకొని క్రిందకు దింపాము.

మఱునాడు మోసేందుకెవ్వరూ రాలేదు. రెండు ప్రాణాలు అందరకూ అశుభమే. నేను కూడా వాహకులలో నొకడనైనాను. ప్రొద్దుగ్రుంకిన తర్వాత నక్షత్ర దర్శనం చేసి భోజనం చేశాను.

**(5)**

ఆ రాత్రి ఒకరాత్రివేళ కల వచ్చింది. ఆ అమ్మాయి పదేండ్లపిల్ల. నేను పదహారేండ్ల కుఱ్ఱవాడిని. వాళ్ళయింట్లో నేను పద్యాలు చదివాను. ఆ అమ్మాయి సీమ మిరపకాయ తీసుకొని వచ్చి తినమన్నది. తిన్నాను. నోరు మండింది. ఏడుస్తూ నిద్రలేచాను. నిద్రలో గుఱ్ఱుకొడుతూ నోరు తెఱచి నిద్రపోయినానేమో? అగ్నిమండలపు పురుగు నాలుకచివర వ్రాలింది. భగ్గున మండింది. నిద్ర మెలకువ రావటంతోటే తెలిసినది. అది నాలుక చివరే కాకుండ పెదవిమీద కూడా పుండైంది. ఆ పుండు సరిగ్గా పదిపన్నెండు రోజుల వరకూ మానలేదు. అన్నం తిననీయలేదు.